# ఓ శాంత కథ

మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్



'ఏ బావిలోనన్నా పడి చావరాదూ?"

భర్త మాటలకి అవాక్కయి పోయింది శాంత.

గంటనించి భార్యాభర్తల మధ్య వాగ్వివాదాలు చెలరేగుతున్నాయి. ఎన్నో విధాల సర్దుకుపోవడానికి ప్రయత్నం చేస్తోంది శాంత.

ఆమె తగ్గిన కొద్దీ అతడు రెచ్చిపోతున్నాడు.

ఈ మాటతో శాంతలో కూడా రోషం చెలరేగింది.

"ఛీ-ఛీ ఇన్ని మాటలనిపించుకునే కంటే నిజంగా బావిలోపడి చస్తే....?"

ప్రకాశానికి కోపం వస్తే పూర్వాపరాలన్నీ తవ్వి మరీ సాధిస్తాడు- వేధిస్తాడామెని!

బొత్తిగా స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు లేని జీవితమైపోతోంది తనది! చచ్చిపోవాలి.... తను చచ్చిపోవాలి!

ఎట్లా ఈ పిల్లల్ని వదిలి?

పోనీ పిల్లలకి కూడా ఏ విషమో ఇచ్చి- తనూ తింటే....? అమ్మో- పిల్లలని- తను కన్న పిల్లలని చేతులారా చంపడమా? అసలు తను చెయ్యగలదా- ఆ పని! వాళ్లని ఒక్క క్షణం కూడా విడిచిపుండలేదు తను!

పిల్లలకి విషంపెట్టి తను తినేలోగా ఆ బాధని తను అసలు భరించలేదు. ఆ గుండెకోత కలలో కూడా వూహించ లేదు.

"పోనీ నేనే చచ్చిపోతాను. చచ్చి పోయేముందు కూతురికి అన్నీ చెప్పి చచ్చిపోతాను. నా చావుకి వాళ్ళ తండ్రే కారణం అని చెప్పి చస్తాను—" అను కుంది.

చెప్తే పిల్లలు తండ్రిమీద ద్వేషం పెంచుకుంటారు. ద్వేషిస్తూనే వుంటారు చివరిదాకా! అది న్యాయం కాదు తనకి!

"నేనే చచ్చిపోతాను. నేనే చస్తే ఆయనకి చింతలేదు. పిల్లలు కొన్నాళ్ళు ఏడిచి...."

అనుకుంటుంటేనే కన్నీళ్ళు వచ్చాయి.

తల్లి, తండ్రీ లేరు శాంతకి. అన్న ఉన్నాడు. ఆ అన్నకూడా అసలు శాంత అనే ఒక తోబుట్టువు బతికివుందనే మర్చిపోయాడు ఏనాడో! పుట్టిల్లు అనేదే లేదు శాంతకి! పెట్టుపోతలు అసలే లేవు!

అమ్మా, నాన్నా వుంటేనే పుట్టిల్లు!

తనకోసం వగచేవాళ్ళే లేరు!

తన బ్రతుకు నిరర్థకం!

అవును. చచ్చిపోవాలి!

అర్ధరాత్రిదాకా ఆలోచిస్తూనే వుంది.

"నువ్వు నా కక్కరలేదు. వెళ్ళిపో— చచ్చిపో— నువ్వంటేనే అసహ్యం— నువ్వున్న ఇంట్లో నే నుండలేను— నీతో జీవితం నరకం...."

చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి ప్రకాశం మాటలు! తల తిరిగిపోతోంది. కళ్ళు మూతలుపడ్డాయి.

* * *

ఉలిక్కిపడి లేచింది శాంత.

రాత్రి పన్నెండు గంటలు!

దృఢనిశ్చయంతో మంచం దిగింది.

అందరూ నిద్రపోతున్నారు.

పిల్లల్ని తృప్తితీరా చూసుకుందో సారి.

కన్నీళ్ళు ఉబికాయి!

పెదవులు చలించాయి!

బుగ్గలు నిమిరింది—

సరిగ్గా కప్పింది—

అడుగులు తడబడ్డాయి!

నిశ్శబ్దంగా కూలబడి వెక్కి వెక్కి ఏడిచింది.

కాసేపయాక మళ్లీ లేచింది.

భర్త హాయిగా నిద్రపోతున్నాడు.

విరక్తిగా నవ్వుకుంది తనలో తనే!

"అయిపోయింది! బంధం తీరి పోయింది నేటితో— ఋణం తీరి పోయింది— వచ్చే జన్మంటూ వుంటే.... ఆడదానిగా పుట్టగూడదు."

గబగబా అడుగులు వేసి— చప్పుడు కాకుండా తలుపు తీసింది. కటికచీకటి— బయట! భయమేసింది.

మళ్ళీ అంతలోనే నవ్వుకుంది. చావ బోయే భయమేమిటి? నిబ్బరంగా బయ

టికి నడిచింది. చీకట్లో కలిసిపోయింది.

*   *   *

శాంత శవాన్ని ఇంటికి తెచ్చి పడుకో బెట్టారు. ప్రకాశం పిచ్చివాడిలాగా ఏడుస్తున్నాడు.

చనిపోయిన శాంత మొహంలో విజయగర్వం! బట్టలన్నీ తడిముద్ద!

పిల్లలు బిక్కు బిక్కుమని చూస్తున్నారు. బిత్తరపోయారు! అడపిల్ల పెద్దది కాబట్టి మౌనంగా వుంది.

పిల్లవాడు— కాసేపయాక— 'అమ్మా— అమ్మా—' అంటూ పెద్దపెట్టున ఏడవ సాగాడు.

పిల్లవాడ్ని గుండెల కదుముకుని మరింత ఏడ్చాడు ప్రకాశం.

తన తల్లిదండ్రులకి టెలిగ్రాం ఇచ్చాడు ప్రకాశం.

వాళ్లు వచ్చారు.

శాంత అన్నకీ ఇచ్చాడు. అతడు రాలేదు.

ఉత్తరక్రియలు జరిగిపోయాయి.

పిల్లలు నాయనమ్మ ఓదార్పుతో కాస్త కోలుకున్నారు.

శాంత చనిపోయి నెలయింది.

ప్రకాశం పేరు పెళ్ళికొడుకుల లిస్టులోకి వెళ్లిపోయింది.

మెల్లిగా పిల్లనిస్తామని— సంబంధాలు రాసాగాయి.

ప్రకాశం తల్లిదండ్రులు ప్రకాశంతో ఈ సంగతి ఎత్తితే గట్టిగా అరిచాడు ప్రకాశం.

"శాంతని అంత సులువుగా నేను మర్చిపోగలనా? నే నీ జన్మలో మళ్లీ పెళ్లి చేసుకోను. మీకంత పిల్లల్ని చూసుకోవడం కష్టంగా వుంటే—మీ రెళ్లి పోండి! నేనే పెంచుకుంటాను— నా పిల్లల్ని!"

దాంతో కొన్నాళ్లు నోరెత్తలేదు వాళ్లు!

అట్లా మాట్లాడిన ప్రకాశం— మరో మూడు నెలలు గడిచాక అతి కష్టంమీదే— ఎన్నో అలోచించి మరో పెళ్లికి ఒప్పుకున్నాడు!

సీతతో పెళ్ళి జరిగిపోయింది తిరుపతిలో!

మొదట్లో ఏదో మనశ్శాంతి కరువైనట్లుగా వుండేది ప్రకాశంకి.

అందుకే సీతని పెళ్ళిచేసుకున్నా— అమెతో ముభావంగానే వుండేవాడు.

సీత చాలా తెలివైంది. శాంతలాగా కాదు. భర్తని ఏ విధంగా ప్రసన్నుణ్ణి చేసుకోవాలో తెలుసు నామెకి!

దానికి మొదటిమెట్టు పిల్లల్ని బాగా చూసుకోవడం— అని తెలుసుకుంది.

పిల్లల్నే అంటిపెట్టుకుని వుండిపోయింది.

వాళ్లకి నీళ్లు— పాలు— అన్నీ స్వయంగా చూసుకునేది. శాంతకన్నా బాగా చూసుకునేది.

కథలు— కబుర్లు— అటలు— పాటలు

అన్నీ పిల్లలతోనే! వాళ్ళల్లో తనూ ఒకతై కలిసిపోయింది.

నోట్లో అన్నం కలిపి పెట్టేది.

వాళ్ళతోనే పడుకునేది.

షికార్లకి—సినిమాలకి తీసికెళ్ళేది.

వాళ్ళచేత 'అమ్మా!' అని కూడా పిలిపించుకోవడం మొదలుపెట్టింది.

ఒక్క మాటలో చెప్పాలంటే—పిల్లలు శాంతని పూర్తిగా మర్చిపోయారు.

ఇది చూసి అత్త-మామలు మురిసిపోయారు!

ఇరుగు-పొరుగు వారు అచ్చెరువందారు!

నలుగుర్లోనూ 'సీతమ్మ దేవత' అనే పేరు వచ్చేసింది!

ప్రకాశం చాలా ఆనందించాడు లోలోపల!

క్రమక్రమంగా కరిగిపోయాడు!

సీతంటే చాలా ఆపేక్ష కలిగింది అతడికి!

సీతపట్ల ప్రసన్నుడయ్యాడు!

సీతకి కావాల్సిందదే!

అదీగాక- సీత ప్రకాశంకి ఏవి నచ్చుతాయో అచ్చం అట్లాగే ప్రవర్తించేది!

ఏ టైములో ప్రకాశం ఇంటికి వచ్చినా నలగని పువ్వులా వుండేది.

శాంతలాగా సాధారణ చీరల్తో ఇంటి పనిలో మునిగివుండేది కాదు.

ఎవరొచ్చినా కలివిడిగా వుండేది.

శాంతలాగా లోపలే వుండిపోయేది కాదు. భోజనాల వేళప్పుడుకూడా— సీత శాంతలా కాదు. శాంత అతడికి పెట్టి కానీ తను తినేది కాదు. సీత అతడితోనే కూర్చుని తింటుంది.

అతడికి నచ్చిన మాటలే మాట్లాడుతుంది. నచ్చని విషయాలు పొరపాటున కూడా తన మాటల్లోకి రానివ్వదు సీత!

ఇంకేం— సంసారం స్వర్గంలాగే వుంది ప్రకాశంకి.

సీత పాచిక పారింది! భర్త సుముఖుడయ్యాడు! మెల్లిగా పిల్లల్ని నిర్లక్ష్యం చెయ్యసాగింది! వాళ్ళకి దూరంగా వుండసాగింది!

అమృతవర్షానికి అలవాటయిన ఆ అమాయకపు పిల్లలకి సీత ధోరణి అర్థం కాలేదు. దిగులుపడిపోయారు!

అయినా సీత పట్టించుకోలేదు!

దానికితోడు మరో రెండు నెలలకి సీతకి నెల తప్పింది! మెల్లిగా పిల్లల్ని చీదరించుకోవడం కూడా మొదలైంది! చివాట్లదాకా వెళ్ళిందది. విసిగిస్తున్నారనే నెపంతో చివాట్లు దెబ్బల వరకూ వెళ్ళాయి! పిల్లల మీద భర్తకి చాడీలు కూడా చెప్పడం ప్రారంభించింది సీత!

పిల్లల్ని మొదట చాలా బాగా చూసుకోవడం చూశాడు కాబట్టి- సీత ఏం చెప్పినా ఇట్టే నమ్మేసేవాడు ప్రకాశం.

చుట్టుపక్కలవాళ్ళు కూడా సీత పట్లే సానుభూతిగా మాట్లాడేవారు.

పిల్లలు పనిమనుషులైపోయారు!



చివరికి వాళ్ల వునికిని కూడా భరించ లేకపోయింది సీత।

"ఏమండీ- ఇంత మందికి నేను చెయ్యలేకుండా వున్నాను. పోనీ పిల్లల్ని బోర్డింగ్‌లో చేర్పిస్తే....?"

"చూడు సీతా- మన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వాళ్లని బోర్డింగ్ స్కూల్లో చేర్పించగలమా? ఇప్పుడు మళ్లీ ఇంకో అబ్బాయో- అమ్మాయో పుట్టబోతున్నారు- మన ఖర్చులు పెరిగేవే కానీ- తరిగేవి కాదు. వాళ్లమీదే కొన్ని వందలు పొయ్యాలంటే...." ఆగిపోయాడు ప్రకాశం.

సీతా కూడా మళ్లీ ఆ మాట ఎత్తలేదు.

'అమ్మో- వాళ్లమీద వున్న డబ్బంతా ఖర్చయితే- రేపు తన పిల్లలకో?'

పాపని స్కూలు మానిపించేసింది సీత, ఆడపిల్లకి చదువెందుకంటూ।

పాప ఏడ్చి గోలపెట్టినా ఎవరూ విన లేదు.

తమ్ముడి పుస్తకాలు చదువుకుంటూ కాలం గడిపింది పాప।

పరీక్షల కెళ్ళకపోయినా తమ్ముడితో సమానంగా చదువుకున్నట్లే పాప!

ఛీత్కారాలతో- ఛీదరింపులతో పెరిగి పెద్దవారయ్యారు పిల్లలు.

సీత కొడుకు మాత్రం అపురూపంగా పెరిగాడు. ప్రకాశం సీత ఏమాటంటే అమాటే! అంతగా బలహీనుడయ్యాడు.

పాపకి సంబంధం కుదిర్చింది సీత. రెండో పెళ్ళివాడు- కట్నం ఇయ్యక్కర్లేదు. పిల్లలున్నారు అతడికి! పెళ్ళికర్చు కూడా వాళ్ళే పెట్టుకుంటామన్నారు!

ఏనాడూ ఏమాటా మాట్లాడని పాప తండ్రి దగ్గిరికి వచ్చింది. "నాన్నా నేనీ పెళ్ళిచేసుకోను నాన్నా! నా కిష్టంలేదు. అమ్మవుంటే నా కిట్లాంటి సంబధం తెచ్చేదా? మీరయినా తప్పించండి ఈ పెళ్ళి...."

సీత రివ్వున దూసుకు వచ్చింది లోపల్నించి- "ఏమిటే మీ నాన్నతో మంతనాలాడుడుతున్నావు? చచ్చినట్లు చేసుకోవాల్సిందే ఈ పెళ్ళి! లేకపోతే జీవితాంతం ఇంట్లో పడుండాల్సిందే- చేసుకోదుట- ఇష్టం లేదుట! కాళ్ళు, చేతులూ విరగొట్టి పడేస్తాను పీటలమీద! ఎట్లా చేసుకోవో చూస్తాను! అవతల పరువూ- మర్యాదా...."

"వీల్లేదు. నా కూతురికి ఈ పెళ్ళి చేశారో మిమ్మెల్ని- మిమ్మల్ని చీల్చి చెండాడతాను-మీ రక్తం కళ్ళజూస్తాను"- శాంత అరిచింది ఫొటోలోంచి!

సీతా- ప్రకాశం తేల్లబోయారు!

"శాంతా- శాంతీ.... శాంతీ- శాంతీ...."

ప్రకాశం పిలుపుకి కళ్ళు తెరిచింది శాంత.

"నేను- నేను- చచ్చిపోలేదా?...."

నీరసంగా అడిగింది.

"శాంతీ- అంత మాటనకు శాంతీ! నువ్వు లేకపోతే నేనూ లేను. నన్ను క్షమించు- శాంతీ- అంతా మర్చిపో.... నువ్వు నాకు కావాలి శాంతీ! నన్ను వదిలి వెళ్ళకు...."

చిన్నపిల్లవాడిలాగా కన్నీళ్ళు కార్చ సాగాడు ప్రకాశం.

"ఈ నాలుగు రోజులూ ఎంత తల్ల డిల్లిపోయానో నేను. మూసిన కన్ను తెరవలేదు నువ్వు! ఒళ్ళు తెలీని జ్వరం! కలవరింతలూను! డాక్టర్ చాలా భయ పెట్టేశాడు గూడా! నువ్వు నాకు దక్కావు- అంతే చాలు- శాంతీ- అంతే చాలు!"


నీరసంగా నవ్వింది శాంత.

పిల్లల్ని పిల్చి అక్కున చేర్చుకుంది! నిశ్చింతగా నిట్టూర్చింది.

మరో వారం రోజులకి ఇంటికి వచ్చేసింది హాస్పిటల్‌నించి శాంత.

"నీ మనసు ఇంకెప్పుడూ బాధ పెట్టను శాంతీ- నన్ను క్షమించు- క్షమించానను శాంతీ-"

ఆ రాత్రి ప్రకాశం శాంతతో అన్న




మాటలకి "మనలో మనకి క్షమాపణ లేమిటి?" అని నవ్వేసింది శాంత.

కానీ ఆమె మనసు ఆలోచిస్తూనే వుంది. ఆడది అన్ని విధాలా బలహీను రాలు.

"క్షమించు–" అన్నాడే గానీ– మళ్ళీ అట్లాంటి సంఘటనలు జరగవని నమ్మకం ఏమీ లేదు.

"మనం విడిపోదాం– నువ్వు నా కొద్దు– నువ్వు రాక్షసివి– చావు–" ఈ మాటలు ఎంతగానో బాధపడుతూనే వుంటాయామెని.

ఆ బాధలో ఏదో చేసెయ్యాలనే తెగింపు కూడా కలుగుతుంది ఒక్కొక్కప్పుడు.

కానీ ఏమీ చెయ్యలేని బలహీనత ఆవరిస్తుంది హఠాత్తుగా. పిల్లలు– సంసారం– బాధ్యత– బంధాలు. ముఖ్యంగా మమత– అనురాగం ఇవన్నీ వదులుకుని ఏమైనా చెయ్యగలదా ఆడది?

చావలేదు– చావకుండా వుండలేదు.

చిత్రవధ.

ఏ ఆడదానికైనా అంతే– దేనికీ స్వాతంత్ర్యం లేదు.

ఇంతే– ఆడదాని కథ. ఈ వలలోంచి తనకు తానుగా ఎన్నడూ బయటపడలేదు.

నిర్లిప్తంగా నవ్వుకుంది– శాంత.

— — —